బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 30 : మండల కేంద్రానికి చెందిన గొల్ల పవన్ కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి జోగు రామన్న మంగళవారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేసి ఉదారత చాటుకున్నారు. వైద్యం చేయించుకోవడానికి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రెక్కాడితే డొక్కాడని నిరుపేద కుటుంబానికి చేయూత నిలిచిన మాజీమంత్రికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఎస్ లింగారెడ్డి, సర్పంచ్ దేవన్న, బీఆర్ఎస్ నాయకులు గణేశ్‌యాదవ్, వెంకట్ రెడ్డి, లస్మన్న, సంజీవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

పాలకవర్గాన్ని సన్మానిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య

బోథ్, జనవరి 30 : సోనాల గ్రామ పంచాయతీ పాలకవర్గం, కోఆప్షన్ సభ్యుల పదవీ కాలం ముగిస్తున్నందున గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పీ లక్ష్మీనర్సయ్య మంగళవారం కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేసిన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్యను జీపీ పాలకవర్గం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెట్లపెల్లి సదానందం, ఉప సర్పంచ్ రామాయి గంగామణి, సెక్రటరీ ఎస్ స్వామి, బిల్ కలెక్టర్ ఎండీ అజారొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలు నిషేధించాలి

ర్యాలీ తీస్తున్న ఆదివాసులు

నార్నూర్, జనవరి 30 : ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఇర్రూ డిమాండ్ చేశారు. మంగళవారం నాగల్‌కొండ గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో కల్తీసారా, మద్యం విక్రయిస్తూ అమాయక గిరిజనుల ప్రాణాలతో చెలగటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు వీటిని ఆరికట్టాలని కోరారు. మద్యం పేరుతో ఆదివాసీ గిరిజనులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 26వ తేదీన దేవారిగూడకు చెందిన గంగారాం మద్యం షాపు దగ్గరనే అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనను గుర్తు చేశారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి మద్యం విక్రయాలు అరికట్టకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోవమారుపటేల్, కుమ్ర లక్కేరావ్, ఇర్రూపటేల్, జాలింషావ్, మహిళలు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం : మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం, జనవరి 30 : కుష్టు వ్యాధిపై మరింత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని హమాలీవాడ యూపీహెచ్‌సీలో జాతీయ కుష్టు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లేప్రే అనే బాక్టీరియా వల్ల వస్తుందన్నారు. స్పర్శ్ పక్షోత్సవాల్లో భాగంగా ఈ నెల30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానన్ మాట్లాడుతూ ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అంతకుముందు మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని మహాత్మాగాంధీ చిత్రపటానికి, కుష్టు వ్యాధి కారక సూక్ష్మక్రిమిని కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ హన్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరితో కుష్టు వ్యాధి నివారణకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, కౌన్సిలర్ కేశవ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రణిత, డిప్యూటీ పారామెడికల్ అధికారులు మధుసూదన్‌రావు, వామన్‌రావ్, ఎల్టీ రమణాచారి, కిరణ్, నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్, జనవరి 30 : ప్రజలందరి సహకారంతో కుష్టు నివారణ సాధ్యమవుతుందని వైద్యురాలు నయనత అన్నారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జైనథ్ గ్రామ పంచాయతీలో కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల భాగంగా అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. గ్రామానికి చెందిన కుష్టు వ్యాధిగ్రస్తురాలిని సన్మానించారు. కార్యక్రమంలో సూజర్‌వైజర్ వేణు, సర్పంచ్ దేవన్న, గణేశ్ యాదవ్, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్, జనవరి 30 : బోథ్ గ్రామ పంచాయతీలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు కుష్టు వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్, సుమంగళ, స్నేహ, జీవన్ రెడ్డి, కట్ట భూమేశ్, షేక్ నాజర్ అహ్మద్, షేక్ షాకీర్, తుకారాం, శంకర్, రాజారాం, ఆశ కార్యకర్తలు శారద, యశోద, ప్రమీల, శోభ, పుష్పలత, అరుణ పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 30 : కుష్టు వ్యాధిపై నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. గుంజాల గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హిమబిందు, ఈశ్వరి, విద్యారాణి, ఉపాధ్యాయుడు రాంరావ్, ఉప సర్పంచ్ చంద, ఆశకార్యకర్తలు సత్యశీల, నాగుబాయి పాల్గొన్నారు.

జైనథ్ : కుష్టువ్యాధి గ్రస్తురాలిని సన్మానిస్తున్న వైద్యులు, గ్రామస్తులు

బోథ్: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ఇంద్రవెల్లి, జనవరి 30: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు చేసిన అభివృద్ధి పనులతో పాటు కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పదవీకాలం ముగుస్తున్న సర్పంచ్‌లను శాలువాతో సన్మానించారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల సమన్వయంతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తేనే అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, పాల్గొన్నారు.

సర్పంచ్‌లను శాలువాతో సన్మానిస్తున్న అధికారులు

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎదులాపురం : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, జనవరి 30 : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆదిలాబాద్ జిల్లా క్యాలెండర్‌ను రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మంగళవారం ఆమె ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్, సభ్యులు తిర్మల్ రెడ్డి, సుజాత, రాధ, రాజేశ్వర్, ఆసూరి ప్రవీణ్, నర్సింగ్, ఓంప్రసాద్, తాలూకా కార్యదర్శి అరుణ్‌కుమార్, సంజయ్, రామకృష్ణ, రజినీకాంత్, అఖిల్ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ గౌస్ అలాం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 : అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ జిల్లా డీపీవో కార్యాలయంలో ఎస్పీ గౌస్ అలాం చేతుల మీదుగా నూతన సంవత్సర 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆర్ జాషువ, మెస్రం భాస్కర్, జిల్లా నాయకులు దీపక్, పెందూర్ తుకారాం, కనక దత్తు, సురేశ్, గోపి, ఏఎస్‌యూ సలాం వరణ్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 : కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీసీఐ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4 కోడ్లుగా తీసుకువచ్చిన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్రం తీరుకు నిరసనగా ఫిబ్రవరి 16న చేపట్టిన దేశ వ్యాప్త బంద్ విజయవంతం కోసం ఫిబ్రవరి 5న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

నేరడిగొండ, జనవరి 30 : ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు, ఆత్మహత్యల నివారణ కమిటీ అధ్యక్షుడు బొర్రన్న డిమాండ్ చేశారు. బొందిడి గ్రామానికి చెందిన రైతు జాదవ్ లక్ష్మణ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. వ్యవసాయానికి సంబంధిత అప్పులు, దిగుబడులు తదితర వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆశించిన దిగుబడులు రాకనే రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన 194 జీవో ప్రకారం ఆరు లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శికి సన్మానం

దాసండ్ల ప్రభాకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, జనవరి 30 : మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దంతన్‌పల్లి గ్రామానికి చెందిన దాసండ్ల ప్రభాకర్‌ను మంగళవారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఇటీవల జగిత్యాలలో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి నుంచి నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అజ్మీర మోతిలాల్, మల్లారెడ్డి, లచ్చన్న, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్, అబ్దుల్ వహీద్, లక్మారెడ్డి, అరవింద్, రజాక్, హనీఫ్ పాల్గొన్నారు.

స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా మనోహర్

మనోహర్‌కు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ వైర్మన్

బోథ్, జనవరి 30: బోథ్ వ్యవసాయన మార్కెట్ కమిటీలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా ఎన్ మనోహర్ మంగళవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. మనోహర్‌ను మార్కెట్ కమిటీ వైర్మన్ సోలంకి రుక్మాణ్ సింగ్, సిబ్బంది మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మాట్లాడుతున్న డిపో మేనేజర్ కల్పన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 : ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆరోగ్య అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డాక్టర్ యోగేశ్వర్ ఆరోగ్యంపై ఏ విధంగా కాపాడుకోవాలో ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంఎఫ్ శ్రీఖర్, ట్రాఫిక్ ఇన్‌చార్జి శ్రీరామ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 30 : విద్యార్థులు ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ బీ నరేశ్ అన్నారు. మంగళవారం సిరికొండలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో రక్తహీనత ముక్త్ తెలంగాణలో భాగంగా హెచ్‌బీ పరీక్షలతో పాటు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుమయ్య, ఫార్మాసిస్ట్ అరుణ్, ఏఎన్ఎం రోజా, హెచ్ఎం సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

యూత్ సభ్యులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న జాదవ్ రవి

ఉట్నూర్ రూరల్, జనవరి 30 : కేబీనగర్ గ్రామానికి చెందన సేవాలాల్ యూత్ సభ్యులకు సామాజిక కార్యకర్త జాదవ్ రవి నాయక్ మంగళవారం క్రికెట్ కిట్, వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గర్భ కోశ వ్యాధి చికిత్స శిబిరం

తాంసి(తలమడుగు), జనవరి 30 : తలమడుగు మండలం లచ్చంపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ సహకారంతో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ జేడీ కిషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఏడీ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, డాక్టర్ రాథోడ్ దూదురాం, శివ చరణ్, సౌమ్య, స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మాట్లాడుతున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ గౌడ్

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 30 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సిరికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రహదారి భద్రతా నియమాల గురించి వివరించారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు సునీల్, మండల వైద్యాధికారి నరేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ, జనవరి 30 : రోడ్డు నియమాలను పాటించాలని నేరడిగొండ ఎస్ఐ సాయన్న విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

ఇంద్రవెల్లి, జనవరి 30 : మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. మంగళవారం ధనోరా(బీ) అంగన్‌వాడీ కేంద్రంలో ఆడపిల్లల సంరక్షణ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస చట్టం, గర్భనిరోధక చట్టం, మహిళాలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్‌రెడ్డి, సూపర్‌వైజర్ ప్రేమల, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

ఎదులాపురం, జనవరి 30 : ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాధన కమిటీ అధ్యక్షుడు నారాయణ యాదవ్ మాట్లాడుతూ రైల్వే సాధన కమిటీ చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతాయన్నారు. సమస్యలు పరిష్కరం కాని పక్షంలో ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్, జాయింట్ సెక్రటరీ మంగడ్లు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుల రవీందర్, ఉపాధ్యక్షుడు ఆప్సార్ ఖాన్, ఎండీ రఫిక్, వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

రైతుబంధు, రుణమాఫీ సంగతేమిటి?

సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు

భీంపూర్, జనవరి 30 : రైతులందరికీ రైతుబంధు రాక, రుణమాఫీ లేక గ్రామాల్లో వారికి సమాధానం చెప్పలేక పోతున్నామని జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భీంపూర్‌లోని రైతు వేదికలో ఎంపీపీ కుడిమెత రత్నప్రభ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏవో రవీందర్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 3,880 మంది రైతులకు 3 ఎకరాల లోపు సంబంధించి రూ.3 కోట్ల 98 లక్షలు ఖాతాలో జమ అయ్యాయని మిగతా వారికి క్రమంగా జమ అవుతాయన్నారు. ఇక రుణ మాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. పెండింగ్ బిల్లులు ఉంటే గృహజ్యోతి వర్తించదని ఏఈ శ్రావణ్ పేర్కొన్నారు. పీఏం జన్‌మన్ కింద పీవీటీజీ గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరయ్యాయని ఏఈ మజార్‌అలీ అన్నారు. గ్రామాల్లో నిరంతర వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి నిఖిల్‌రాజ్ అన్నారు. అడవులను సంరక్షించడం అందరి బాధ్యత అని ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్ సూచించారు. గుబిడి, మహారాష్ట్ర మాండ్వి, గొల్లగడ్, తాంసి(కే) గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్‌లు కోరారు. పదవీకాలం ముగుస్తున్న సర్పంచ్‌లను శాలువాతో సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరీశ్, ఏపీవో సంగీత, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యలపై సీఎం స్పష్టత ఇవ్వాలి

మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణాధ్యక్షుడు గొడం గణేశ్

బోథ్, జనవరి 30: సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా ఆదివాసుల సమస్యలపై స్పష్టం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణాధ్యక్షుడు గొడం గణేశ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ నిరుద్యోగ సమస్య వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణాధ్యక్షుడు గొడం గణేశ్, రాష్ట్ర కార్యదర్శి నగేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు భోజన్న, సలహాదారుడు పంద్రం శంకర్, బోథ్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వరరావ్ పాల్గొన్నారు.

ముక్తాసాల్వే అడుగు జాడల్లో పయనిద్దాం

నార్నూర్, జనవరి 30 : ముక్తాసాల్వే అడుగు జాడల్లో పయనిద్దామని అన్నాబావుసాఠే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముక్తాసాల్వే 183వ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైర్మన్ సురేశ్, డైరెక్టర్ దుర్గే కాంతారావు, మండలాధ్యక్షుడు మహేందర్, దళిత జేఏసీ నాయకుడు మహేందర్, రాణాప్రతాప్, నాయకులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులపై అవగాహన

గుడిహత్నూర్, జనవరి 30 : తోషం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర జంతువు సంరక్షణ ఎనిమల్, వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెంపుడు జంతువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి కిషన్ మాట్లాడుతూ వీధి కుక్కలపై సానుభూతితో వ్యవహరించాలన్నారు. కుక్కకాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పెంపుడు జంతువుల యజమానుల సందేహాలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు రాథోడ్ రామారావ్, మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలిపివేత

బోథ్, జనవరి 30 : బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని బోథ్, పొచ్చర, సోనాల, నేరడిగొండ సీసీఐ కేంద్రాల్లో పత్తి నిల్వలు అధికంగా ఉన్నందున జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవన్న ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఫిబ్రవరి 6వ తేదీ నుంచి యథావిధిగా పత్తి కొనుగోలు జరుగుతాయని, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఇంకెన్ని సంవత్సరాలకు సౌకర్యాలు కల్పిస్తారు

ఉట్నూర్, జనవరి 29 : ఇంకెన్ని సంవత్సరాలకు గిరిజనులకు మౌళిక సదుపాయాలు కల్పిస్తారో నాయకులు చెప్పాలని సాధన కమిటీ తాత్కాలిక కన్వీనర్ భరత్ చౌహాన్ మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూర్ ప్రాంతం చాలా వెనుకబడిందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ మీదుగా మంచిర్యాల, కాగజ్‌నగర్‌కు రైల్వేలైన్, ఉన్నత విద్యకు అగ్రికల్చర్, డెంటల్, మెడికల్, వెటర్నిటీ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని, తాగు, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677